సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ బిందు

బీఆర్ఎస్సే తెలంగాణకు రక్ష

జడ్పీ చైర్‌పర్సన్ బిందు

బయ్యారం, ఏప్రిల్ 29: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే రక్ష అని జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ మే 1 జరుగనున్న మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ రోడ్డు షో విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆమె మండలంలోని గౌరారం, గురిమళ్ల, లక్ష్మీపురం, ఇసుకమేది గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బిందు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజుల్లోనే గ్యారెంటీలన్నీ అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చి హామీలు అమలు చేయించేలా కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, ఎంపీటీసీ భద్రయ్య, నాయకులు ఎనుగుల ఐలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చర్చలో పాల్గొన్న వ్యాపారులు, కార్మికులు

మార్కెట్‌లోనే ధాన్యం కొనుగోలు చేయాలి

కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

కేసముద్రం, ఏప్రిల్ 29 : వ్యాపారులు మిల్లుల వద్ద కాకుండా మార్కెట్‌లోనే ధాన్యం కొనుగోలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు సోమవారం మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించడం వల్ల కార్మికులకు ఉపాధి కలుగుతుందన్నారు. మార్కెట్‌లో పంట ఉత్పతులను కొనుగోలు చేస్తే వ్యాపారులు కార్మికులకు డబ్బులు చెల్లించాలనే పేరుతో రైతుల వద్ద నుంచి తీసుకుంటూ కార్మికులకు ఇవ్వడంలేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు వ్యాపారులు, కార్మికులతో చర్చలు జరిపారు. చర్చలు కొలిక్కి రాకపోవడంతో శనివారానికి వాయిదా వేశారు. సమావేశంలో వ్యాపారులు వేంకటేశ్వర్లు, జీ ప్రమోద్, శ్రీరామ్, కిరణ్, రమేశ్, కార్మిక సంఘాల నాయకులు ఎస్ శ్రీధర్, కంచ వెంకన్న పాల్గొన్నారు.

మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

వ్యవసాయ మార్కెట్‌ను ఐదు రోజులు నడపాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 29 : మండుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా మానుకోట వ్యవసాయ మార్కెట్‌ను వారంలో ఐదు రోజులు నడపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గునికంటి రాజన్న కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌కు వరి, ఆపరాలు ఎక్కువగా వస్తున్నందున అధికారులు మార్కెట్‌ను కేవలం మూడు రోజులు మాత్రమే నడుపుతామని ప్రకటించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపు సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం గోస పడుతున్నాం..

మండల సభలో ఎంపీటీసీల ఆగ్రహం

మండల సభలో అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీలు

గూడూరు, ఏప్రిల్ 29 : గ్రామాల్లో తాగునీటి కోసం మహిళలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, ఎంపీటీసీలు కత్తిస్వామి, బోడ కిషన్ మండల సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ బానోత్ సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవిలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందని, కొన్ని ప్రాంతాల్లో రైతులు సాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తమ గ్రామాల్లో నిలదీస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రణాళిక ప్రకారం తాగు, సాగు అందించాలని, మే నెలలో మరింత గడ్డు పరిస్థితి రాకుండా చూడాలన్నారు. మండలంలోని గుండెంగకు, మహబూబాబాద్ మీదుగా గుండెంగ, నెక్కొండ మీదుగా వేములవాడకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మద్యం షాపుల్లో సామాన్యులకు అవసరమైన మద్యం దొరకడంలేదని, బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు కొనాల్సివస్తున్నదన్నారు. అధికారులు దృష్టి సారించి మద్యం దందాను అరికట్టాలని జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు కాశీం అధికారులను కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీలకు సెలవులు ప్రకటించాలని ఎంపిటీసీ కత్తి స్వామి కోరారు. సమావేశంలో వైద్యం, విద్య, వ్యవసాయ, విద్యుత్, అటవీ తదితర శాఖ అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

మండల సభలో ఎంపీపీ పద్మావెంకట్‌రెడ్డి

చిన్నగూడూరు, ఏప్రిల్ 29 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీపీ వల్లూరి పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సభలో తాగునీరు, వైద్యం, పారిశుధ్యం, ఐసీడీఎస్, మిషన్ భగీరథ తదితర శాఖలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, వెంటనే ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో నిత్యం పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ,ఎంపీడీవో రామారావు, కో ఆప్షన్ సభ్యులు మూసిన్ బేగ్, అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మండల సభలో ప్రగతి నివేదికను చదువుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

హుండీ అపహరించిన వ్యక్తి అరెస్టు

డోర్నకల్, ఏప్రిల్ 29 : మండలంలోని చిల్కోడు గ్రామ సమీపంలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో హుండీ చోరీ చేసిన నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సంతోశ్‌రావు కథనం ప్రకారం.. ఈ నెల 10న చిల్కోడు సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయంలో హుండీలోని రూ.30వేల నగదు దొంగలు అపహరించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి గోపీని పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రేపటి నుంచి వేసవి క్రీడల శిక్షణ శిబిరాలు

మహబూబాబాద్, ఏప్రిల్ 29 : మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడల శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి అనిల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 10 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తామని, జిల్లా చైర్మన్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ ఆదేశాలతో ఒక్కో క్రీడకు ఒక శిక్షకుడిని కేటాయించినట్లు తెలిపారు. కురవిలో నిర్వహించే అథ్లెటిక్స్‌కు సింధూవర్మ, కేసముద్రం మండలం కల్వలలో బేస్‌బాల్‌కు బీ బాలాజీ, మరిపెడ మండలం తానంచర్లలో తైక్వాండోకు కే మానస, గార్లలో బాస్కెట్‌బాల్‌కు బీ చంద్రశేఖర్, నర్సింహులపేటలో కబడ్డీ క్రీడకు టీ సురేశ్, తొర్రూరు మండలం పోలెపల్లిలో కబడ్డీకి టీ వంశీకృష్ణ, మరిపెడ మండలం ఎల్లంపేటలో అథ్లెటిక్స్ పీ సురేశ్, నర్సింహులపేటలో వాలీబాల్‌కు క్రీడకు వీరారెడ్డి, ఇనుగుర్తిలో వాలీబాల్‌కు ప్రణయ్, కురవి రాజోలులో ఫుట్‌బాల్‌కు డీ సునీల్‌ను శిక్షకులుగా ఎంపిక చేసినట్లు అనిల్ పేర్కొన్నారు.

'మే' డేను విజయవంతం చేయాలి

గార్ల, ఏప్రిల్ 29: మే డేను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం గార్లలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ అనుబంధ, సంఘటిత, అసంఘటిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు.



కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

సారు వెంటే మేము..

దంతాలపల్లి, ఏప్రిల్ 29: మండలంలోని దాట్ల గ్రామంలో కొంతమంది నాయకులు పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలు, ఓటర్లు ఎవరూ పార్టీ మారలేదని, 'సారు వెంటే మేము.. కారు గుర్తే మాది' అంటూ సోమవారం గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు కార్యకర్తలు వివరించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. కొంతమంది నాయకులు పార్టీ నుంచి పోయినంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి కవితను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నాయకులు మల్లారెడ్డి, కొండ బుచ్చయ్య, వీరన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌సారథి

మోదీని గద్దె దించాలి

మహబూబాబాద్, ఏప్రిల్ 29 : దేశంలో బీజేపీ శకం ముగిసిందని, అరాచక పాలన సాగిస్తున్న మోదీని గద్దె దింపాలని మహబూబాబాద్ సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బామనపల్లి అజయ్‌సారథి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో నర్రా శ్రావణ్ అధ్యతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా అజయ్ హాజరై మాట్లాడారు. దేశంలో మూడోసారి మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని కలలు కంటున్నారని, ఆ పార్టీకి వంద సీట్లు కూడా రావన్నారు. 350 సీట్లతో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విభజన హామీలను తుంగలోతొక్కిన మోదీకి గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రేపపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, వీరవెళ్లి రవి, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు తక్షణమే విడుదల చేయాలి



విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న సురేశ్‌బాబు

పెద్దవంగర(తొర్రూరు), ఏప్రిల్ 29 : సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థుల ఐదో సెమిస్టర్ ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని సీవైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ సురేశ్‌బాబు డిమాండ్ చేశారు. విద్యార్థులకు మద్దతుగా సోమవారం సాయిరాం కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేయూ పరిధిలో మూడు నెలల క్రితం జరిగిన ఒకటి, మూడు, ఐదో సెమిస్టర్ డిగ్రీ పరీక్షల్లో ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదలై నెల రోజులు కావస్తున్నా సాయిరాం కళాశాల విద్యార్థుల ఫలితాలు రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సాయిరాం డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలో పడేసిందన్నారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు వచ్చేనెల 6 నుంచి ప్రారంభం కానున్న తరుణంలో ఇప్పటివరకు ఫలితాలు విడుదల కాక విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పవన్, మనోజ్ ,రమేశ్, శివ, ఉదయ్, వెన్నెల, హారిక, జాస్మిన్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఫెయిలయ్యానని..

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

స్వాతి (ఫైల్)

నర్సింహులపేట, ఏప్రిల్ 29: ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం నర్సింహులపేట మండలంలోని రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రచకృతండాలో జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. తండా కు చెందిన గుగులోత్ భీమా– పద్మ దంపతుల రెండో కుమార్తె స్వాతి(17) తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపీ కవిత విద్యార్థిని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలిక తల్లిదండ్రులను ఓదార్చారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

మహబూబాబాద్, ఏప్రిల్ 29 : జిల్లాలోని అన్ని ప్రాథమిక దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో కళావతిబాయి ఆదేశించారు. సోమవారం ఆమె మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జంగిలిగొండలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాన్ని వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. దవాఖానల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీ మహేందర్‌రెడ్డి, ఆరోగ్య బోధకులు కే మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SWAPANASREE YELLENKI, R/o. H.No. 3-339, Main Road, Parkal, Warangal, Hanumakonda, 506164, T.S., Changed My Name as YERRA SWAPNA SRI.
NTW-00

CHANGE OF NAME

★I, ADAPA ROJA R/O H.NO. 22-8-52, DOCTORS COLONY 2, DESHAIPET, WARANGAL, TS. Changed My Name As GATLA MANASA W/o. GATLA RAVINDER.
NT-327809

జాబ్ గ్యారంటీ

★మన జిల్లాలోని నూతనంగా ప్రారంభించిన ప్రముఖ కంపనీలలో జాబ్ చేయుటకు హెల్పర్స్, సూపర్ వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, టీం లీడర్స్ కావలెను. జీతం: 15,000/- to 21,000/- రూం+భోజనం కలదు. సెల్: 8121287441.
NTW-00

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

ఇండియా కూటమి కాదు.. అవినీతి కూటమి

మహబూబాబాద్ సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, పక్కన పార్టీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

- కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి కరువు
- ఆ పార్టీలో ఇటలీ పాలన కొనసాగుతోంది
- మానుకోట ఎన్నికల ప్రచార సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

మహబూబాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా, రాహుల్ గాంధీలతో పాటు ఇండియా కూటమి నేతలు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో పాటు అందరూ అవినీతి పరులేనని, ఇది ఇండియా కూటమి కాదు.. అవినీతి కూటమి అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ ఎన్నికల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ.. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థే లేరని అన్నారు. భారతదేశంలో సోనియా గాంధీ పుట్టిన ఇటలీ దేశ రాజకీయ విధానాలు అవలంబిస్తూ ఈ దేశానికి ఉపయోగ పడే విధానాలు అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ చరిత్ర గురించి తెలియడం లేదన్నారు. ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు కేవలం ఒక గ్రామానికి రెండు ఇళ్లు మాత్రమే ఇచ్చేదని, ప్రస్తుతం మోదీ నేతృత్వంలో పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 4కోట్ల ఇళ్లను కట్టించామని, రానున్నా ఐదేళ్లలో మరో మూడుకోట్ల ఇళ్లను నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎంత నీచానికి దిగజారారంటే తెలంగాణ సోషల్ మీడియాలో అమిత్ షా పేరుతో వారు మాట్లాడని మాటలు సృష్టించి పోస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ సభా వేదికపై డాక్టర్ లక్ష్మణ్, గరికపాటి మోహన్‌రావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ధర్మారావు, బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

కేసముద్రం, ఏప్రిల్ 29 : గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధి కేసముద్రం మండలంలోని గిర్నితండా, బ్రహ్మంగారిగుడి తండా, అమీనాపురం, ఎన్టీఆర్ నగర్, కట్టుకాల్వ తండాల్లో అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు ఆధ్వర్యంలో వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ మహబూబాబాద్, గూడూరు ఎక్సైజ్ సిబ్బంది గుడుంబా స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. 130 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 3600 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేశ్వర్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ నీరజ, గూడూరు సీఐ భిక్షపతి, ఎస్సైలు రాజేశ్వరి, రజిత, కిరీటి పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న చక్కెర పానకాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

వడదెబ్బ తో ఒకరి మృతి

మల్సూర్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 29 : వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం జరగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణ శివారు సాలార్ తండాకు చెందిన భూక్యా మల్సూర్ (46) హమాలీ పని చేస్తున్నాడు. సోమవారం ఎండలో పనికి వెళ్లి ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య జిల్లీ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలరాజు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

నెల్లికుదురు, ఏప్రిల్ 29: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సకల సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో బాలరాజు అధికారులకు సూచించారు. మండలంలోని వావిలాల, రాజులకొత్తపల్లి, ఆలేరు, బోటిమీదితండా, ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం, పెద్దతండాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య ఎంత..?, గాలి, వెలుతురు సౌకర్యంగా ఉందా..? తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం రాజులకొత్తపల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, ఆయా గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పార్థసారథి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వీరన్న

కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలి

దంతాలపల్లి, ఏప్రిల్ 29: ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. మండలంలోని కుమ్మరి కుంట్ల గ్రామంలో సోమవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని, 300 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. అదానీ, అంబానీ వంటి బడా వ్యాపారవేత్తలకు రూ.లక్షల కోట్ల రుణమాఫీ, వడ్డీ మాఫీ చేస్తున్న కేంద్రం ఉపాధి పథకానికి డబ్బులు వృథా అనడం సరికాదన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు యాకయ్య, నవీన్, ప్రవీణ్, యాకయ్య, శ్రీను, ఉప్పలయ్య పాల్గొన్నారు.

బావిలో పడి నెమలి మృతి

ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లికుదురు, ఏప్రిల్ 29 : వ్యవసాయ బావిలో పడి నెమలి మృతి చెందిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తారాసింగ్‌బావి తండాలోని గుగులోత్ కిషన్ వ్యవసాయ బావిలో జాతీయ పక్షి నెమలి పడి మృతిచెందింది. సుమారు 3 కిలోల బరువు ఉంటుందని, 20 రోజుల క్రితం బావిలో పడి ఉంటుందని స్థానికులు తెలిపారు.

మజ్జిగ వితరణ

పెద్దవంగర(తొర్రూరు), ఏప్రిల్29 : తొర్రూరు పట్టణంలోని బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి ఆధ్వర్యంలో సోమవారం అధ్యక్షురాలు వజినపల్లి శైలజ అధ్యక్షతన మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి ప్రతి రోజూ మజ్జిగని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ డాక్టర్ శారద, తెలంగాణ సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబు, శ్రీ శ్రీ కళావేదిక సహాయ కార్యదర్శి నాల్లం శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి సంస్థ సభ్యులు రాధిక, సబిత, ఉమారెడ్డి పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన శ్రీగంధం తోట

బయ్యారం, ఏప్రిల్ 29 : ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో శ్రీగంధం తోట ఆహుతైపోయింది. మండలంలోని రెడ్యాతండా శివారులో ఓ రైతు తన చేనులో చెత్తను తగలబెట్టాడు. అది రగులుకుంటూ పక్కనే ఉన్న బానోత్ బీమాకు చెందిన రెండు ఎకరాల శ్రీగంధం తోట, బానోత్ రాంకోటికి చెందిన మూడెకరాల మక్కజొన్నకు, రెండు వ్యవసాయ బోర్లు అంటుకొని అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.4 లక్షల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

అగ్నికి ఆహుతైన మక్కజొన్న పంట